మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి,అభివృద్ధి

## - అదనపు కలెక్టర్ రమేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** పరిశ్రమల ఏర్పాటు వల్ల ఉపాధితో పాటు పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జిల్లా అదనపు పాలనాధికారి రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు చిన్నశంకరంపేటలో రాధాస్టీల్ పరిశ్రమ విస్తరణలో ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, కార్మిక చట్టాలకు లోబడే పరిశ్రమను విస్తరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలన్నారు. పరిశ్రమలు ఏర్పడటం ద్వారా నిరుద్యోగం, పట్టణాలు, అభివృద్ధి చెందుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడాలని, ప్రతి పరిశ్రమలో మొక్కలను పెంచాలని ఆయన సూచించారు. పరిశ్రమల విస్తరణతో స్థానిక యువతకు ఉద్యోగ, అవకాశాలు కల్పించాలని పరిశ్రమ చైర్మన్ సునిల్ షరాఫ్‌కు సూచించారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా వైకుంఠ రథం, ఫ్రిజర్, అలాగే పట్టంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని పేద విధ్యార్థులకు సైకిళ్లను, ఆలయాల అభివృద్ధికి నిధులను కేటాయిస్తానన్నారు.అలాగే 400 మంది స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పగా, బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు మాట్లాడుతూ పరిశ్రమలో 200 మందికి పట్టణ వాసులకి,200 మంది మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల యువతను తీసుకొవాలని కోరారు. చిన్నశంకరంపేట నుండి మిర్జాపల్లికి వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైందని, గత మూడెళ్లుగా ప్రభుత్వం పట్టించుకోకుండా ఉందని, పరిశ్రమల వారు ముందుకు వచ్చి రహదారి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. వైద్యం కోసం ఎంతో దూరం వెళ్లాల్సి వస్తుందని, చుట్టూ ఉన్న పరిశ్రమ వారి సహకారంతో అన్ని సౌకర్యాలతో నూతన ఆసుపత్రి లేదా, పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని దత్తత తిసుకోని అభివృద్ధి చేస్తే పరిశ్రమలోని కూలీలకు, మండల వాసులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆయన తెలిపారు. పట్టణ వాసులు రాధా స్టీల్ పరిశ్రమ విస్తరణను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పీసీబి డీఈ పాఠక్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ మన్నన్, పట్టణ తాజా మాజీ సర్పంచి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ కృపావతి, లక్ష్మారెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి, కిష్టయ్య,జీవన్, మేడి గణేష్, కోడూరి రమేష్ గౌడ్, రామాయంపేట సీఐ వెంకటేష్, చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గోన్నారు.

## పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం

### -మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు సూచనలు మేరకు మార్చి 9వ తారీఖున నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై శుక్రవారం పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సంగారెడ్డిలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సంగారెడ్డి కోర్టుకు సంబంధించిన పోలీసు అధికారులతో, కోర్డు కానిస్టేబుల్‌లతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు, సంగారెడ్డి అడిషనల్ ఎస్‌పి సంజీరావు, సంగారెడ్డి డిఎస్‌పి సత్తయ్య, సిఐ, ఎస్ఐలు, ఎక్సైజ్, కోర్టు కానిస్టేబుల్, లీగల్ సర్వసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బందులు

## -భారత్‌బంద్ విజయవంతం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి,సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి, ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్, బిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి మంచే నర్సింహులు, హెచ్ ఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఈదారి మల్లేశంలు అన్నారు. కేంద్ర కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో హై స్కూల్స్ మైదానం నుంచి పాత బస్టాండు వరకు శుక్రవారం భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 10 యేండ్ల కాలంలో కార్మిక, రైతాంగ, ప్రజలకు ఒక్క మంచి పని చేయకపోగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి 29 కార్మిక చట్టాలను రద్దు పరిచి బడా పెట్టుబడి దారి కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా పార్లమెంట్‌లో చట్టాలు చేసిందని దీంతో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 8 గంటల పని విధానం, కనీస వేతనాల చట్టం, సమ్మె చేసే హక్కు, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు తదితర అంశాలతో కార్మిక వర్గ కోరలు పీకేసే విధంగా చట్టాలు మార్పు చేసిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి పేద తరగతి ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం జాయింట్ యాక్షన్ పేరుతో గ్రామీణ బంద్ సమ్మెను విజయవంతం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అయా సంఘాల నాయకులు చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, సంజుకుమార్, శ్రీకాంత్, జేరిపోతుల జనార్ధన్, ఎం.పద్మ, బాలసయ్య, కనకయ్య, వెంకటయ్య, భాస్కర్, రాజమౌళి, మల్లయ్య, శోభన్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, బెక్కంటి సంపత్, నాగరాజు, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ గ్రామస్తుల విన్నపం

## -పట్టించుకొని అధికారులు ఆవేదన చెందుతున్న గ్రామస్తులు
## -శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడలంటున్న ప్రజలు


ప్రభుత్వ భూమిలో ఫ్లేక్సిలను ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

**కొండపాక, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త** ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కాకుండా చూడాలని గ్రామస్తులు అధికారులను వేడుకున్న పలితం లేకుండా పోయిందని వారు అవేదన వ్యక్తం చేస్తున్న సంఘటన మండల పరిధిలోని ఖమ్మంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 1061లో భూమి కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకొవాలని గత వారం రోజుల క్రితం గజ్వేల్ అర్డీఒకు, నెల రోజుల క్రితం కొండపాక తహసీల్దార్‌కు గ్రామస్తులు కలిసి వినతి పత్రాలు ఇచ్చిన ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకొకపోవడంతో పలితం కేకుండా పోయిందని గ్రామస్తులు అవేదన వ్యక్త చేస్తున్నారు. అధికారులు స్పందించక పోవడంతో గ్రామస్తులంత ఎకమై అట్టి భూమిలో ఇది ప్రభుత్వ భూమి అంటు ఫ్లేక్సిలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి గ్రామ అవసరాలకు పనికి వస్తుందని వెంటనే అధకారు భూమిని కాపాడాలని వారు కోరారు. భూ కబ్జాదారులకు అధికారులకు మద్య ఎమి జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని వారు అవేదన చెందుతున్నారు. ఇప్పటికైన రెవేన్యూ శాఖ ఉన్నతధికారలు చర్యలు తీసుకొని అట్టి భూమిలో ఇది ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేని పక్షంలో గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలేత్తె అవకాశాలు ఉన్నయని తెలిపారు.

# ఎన్నికలు నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

## -అధికారులతో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



జిల్లా అధికారులతో సమావేశం అయిన జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. శుక్రవారం సంగారెడ్డిలో జిల్లా అధికారులతో పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరితో కలిసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు ఫ్రీ అండ్ ఫేర్‌గా ముగిసేలా చర్యలు తీసుకుందామన్నారు. 100 శాతం ఓటింగ్‌కు అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. 5 పార్లమెంట్ స్థానాలకు జిల్లాలో పోలింగ్ జరుగుతుందని, ఆయా శాఖల అధికారులకు వర్క్ ఆసైన్ చేస్తూ తమకు కేటాయించిన పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం నందు వీల్ చైర్, అవసరాన్ని బట్టి బ్రెయిలీ బాలట్ పేపర్స్ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 9 చెక్ పోస్టులు ఉన్నాయని, అవసరాన్ని అనుసరించి అదనపు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి సూచించారు. ప్రజలు ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి ఉండాలని, ప్రత్యర్థ పార్టీలను, వ్యక్తులను కించపర్చేలా వాఖ్యలు చేయరాదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కామరెడ్డి అదనపు కలెక్టర్ మనుచౌదరి, అదనపు ఎస్‌పి సంజీవరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా ను చార్మినార్ జోన్‌లో కలపాలి

## -అసెంబ్లీ లో ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సా పూర్,ఫిబ్రవరి 16.ప్రభాతవార్త:** మెదక్ జిల్లా ను సిరిసిల్లా జిల్లా నుండి చార్మినార్‌జోన్ లోకి మార్చాలని నర్సా పూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు ఆమె శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు.ఈ విషయాన్ని విలేకరులకు చెప్పారు.సరిసిల్లా జోన్ ఉండటం వలన మెదక్ జిల్లాకు చెందిన ఉద్యోగులు దూర భారంతో ఇబ్బందులు పడుతున్నారని పదోన్నతులు రావని అబద్రతా బావంతో ఉన్నారని తెలిపారు.హైద్రాబాద్ కు దగ్గరలోని మెదక్ ప్రాంత వాసులు ఎక్కువగా హైద్రాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు.ఎంతో దూరంలోని సిరిసిల్లా జోన్ లో మెదక్ జిల్లాను చేర్చడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమతో పాటు కాంగ్రెస్, బిజెపి ల నాయకులు సైతం నర్సా పూర్ ను చార్మినార్ జోన్ లోకి తేస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు.ఇప్పటికైనా నిరుద్యోగుల, ఉపాధ్యాయుల,ఉద్యోగుల ఆవేదనను పరిగణలోకి తీసుకొని వెంటనే మెదక్ ను చార్మినార్ జోన్‌లోకి మార్పు చేయాలని అన్నారు.అంతేగాక నర్సా పూర్ గజ్వేల్ నియోజకవర్గాలకు చెందిన రైతులు హాల్దీవాగు చెక్ డ్యామ్ ల కింద పంటలు సాగు చేస్తుతున్నారని కాగా వేసవీ నేపద్యంలో నీరు అడుగంటుతుండగా వారు ఆందోళనకు గురవుతున్నారని సునీతారెడ్డి వాపోయారు.మల్లన్నసాగర్ నుంచి నీటిని వదిలి హాల్దీ వాగును నింపాలని తద్వార రైతులకు మేలు చేకూరుతుందని వివరించారు.

# ఇల్లే లేదు...లక్షల్లో కరెంటు బిల్లు

## -ఫోరం ముందు వినియోగదారుల మొర

**పాపన్నపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఉండేందుకు ఇల్లు లేకున్నా 2 లక్షల రూపాయల కరెంటు బిల్లు చెల్లించాలని విద్యుత్ అధికారులు డిమాండ్ నోటీసు ఇచ్చిన సంఘటన పెద్ద శంకరంపేట మండలంలోని జంబికుంట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు శ్రీనివాస్ శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఫిర్యాదు చేశారు. బాధితుడు శ్రీనివాస్ కథనం ప్రకారం... గ్రామంలో తమకు ఇల్లు లేకున్నా అధికారులు కండ్లు బైర్లు కమ్మేలా 2లక్షల బకాయి బిల్లు చెల్లించాలని నోటీసులు అందించారని ఆందోళన వ్యక్తం చేశారు. 80 యూనిట్ల కరెంటు కాలితే 8427 రూపాయలు చెల్లించాలంటూ బిల్లులు అందచేశారని అల్లాదుర్గం మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామానికి చెందిన అంజయ్య వాపోయాడు. వ్యవసాయ బోరుబావి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి తిరిగి ఏర్పాటు చేయడం లేదని రైతులు ఫోరం అధికారులకు ఫిర్యాదు చేశారు. పాపన్నపేట వెంకటేశ్వర ఆలయం వరకు విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వినతి పత్రం అందచేశారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల వినియోగదారులు అందించిన ఫిర్యాదులను ఫోరం అధికారులు స్వీకరించారు.

ఫోరంకు అందిన ప్రతి సమస్యలను పరిష్క రిస్తామని ఫోరం చైర్మన్ నాగేశ్వర్‌రావు, కమిటి సభ్యులు వెంకట్‌లు వెల్లడించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ఏడి మోహన్‌బాబు, ఏఈ నరసింహులు, పోల్కంపేట రవి, యూసుఫ్, సద్దాం హుస్సేన్, ఆయా మండలాల విని యోగదారులు పాల్గొన్నారు.

# యధేచ్చగా అక్రమ మట్టి రవాణా...!

## -కనెత్తి చూడని మైనింగ్ అధికారులు
## -తూతూమంత్రంగా పోలీసుల తఖినీలు...

**హుస్నాబాద్,ఫిబ్రవరి16,ప్రభాతవార్త** హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్,తోటపల్లి గ్రామాల పరిధిలోని ఊర చెరువు నుండి నల్లమట్టి యధేచ్చగా అక్రమ రవాణా జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్ అధికారులు కనీసం కనెత్తి చూడడం లేరని గ్రామస్తులు వాపోతున్నారు.ఇక ఈ విషయంలో చొరవ చూపాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోగా పోలీసులు మాత్రం ఫిర్యాదులు అందినప్పుడు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని వాపోతున్నారు.గ్రామంలో ఈ అక్రమార్కులు ఇదివరకే 22లక్షల విలైవైన నల్లమట్టిని ట్రాక్టర్లు జెసిబిల సహాయం ద్వార ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని,ఉన్నత అధికారులకు గ్రామ యువత ఫిర్యాదు చేస్తే తనిఖీలకు వచ్చే అధికారులే అక్రమార్కులకు సమాచారం అందిస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబందిత అధికారులు వెంటనే స్పందించి చెరువులోని నల్లమట్టిని కాపాడే చొరవ తీసుకోవడంతో పాటు సహజవనరులను కాపాడాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.


ఇటుక బట్టీల వద్ద నిల్వ ఉంచిన నల్లమట్టి దృశ్యం

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

## -హుస్నాబాద్ సీఐ కిరణ్


అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

**కోహేడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ అన్నారు. మండల పరిధిలోని మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు శుక్రవారం అకస్మికంగా దాడులు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 4 ట్రాక్టర్లను సీజ్ చేశారు. తంగళ్లపల్లి గ్రామానికి చెందిన చొప్పరి సంపత్, చొప్పరి లింగం, చొప్పరి శ్రీకాంత్, బిగుళ్ల నరేష్‌లు మోయతుమ్మెద వాగు నుంచి నాలుగు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చట్ట పరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటమన్నారు. సిద్దిపేట సీపీ డా॥అనురాధ అదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయన వెంట కోహేడ ఎస్ఐ తిరుపతి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం బంగారం

### -జిపిపి డిపో మేనేజర్ సురేఖ

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):** మేడారం సమక్క, సారక్క జాతరకు వెళ్లలేని భక్తులకు టిఎస్ ఆర్టీసీ ఇంటి వద్ద నుండే మేడారం అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకునే అవకాశం కల్పించిందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ బి.సురేఖ తెలిపారు. బుకింగ్ చేసుకోవాలి అనుకునే భక్తులు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తూప్రాన్ కౌంటర్లకు విచ్చేసి బుకింగ్ చేసుకోవచ్చని లేదా 9154298668, 7997801130 నెంబర్ల ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. జాతర అనంతరం ప్రసాదాన్ని భక్తులకు డోర్ డెలివరీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## నేడు జోగిపేటలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన

**జోగిపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నేడు జోగిపేటలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంత్రి పర్యటించనున్నారని అందోలు కాంగ్రెస్ కమిటి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారంనాడు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో అందోలు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అంశంపై జోగిపేటకు చెందిన వ్యాపారస్తులు, కుల సంఘాల వారితో ఆయన ప్రత్యేకంగా చర్చించి, సూచనలు-సలహాలు తీసుకోనున్నారని వారు తెలిపారు. జోగిపేట అభివృద్ధికి ఏమైనా ముఖ్యమైన సలహాలు ఇయ్యదలుచుకున్నవారు ఈ సమావేశానికి హాజరు కావొచ్చని వారు పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు ఈ సమావేశం ఉంటుందని వారు తెలిపారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్

**రాయపోల్,ఫిబ్రవరి16 ప్రభాతవార్త** రాయపోల్ మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న దుబ్బాక రెవెన్యూ డివిజన్‌లో కలపవద్దని, ప్రస్తుతం ఉన్నట్లుగా గజ్వేల్ రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్, జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి అన్నారు. శుక్రవారం ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్ అధ్యక్షతన రాయపోల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులు రాయపోల్ మండలాన్ని దుబ్బాక రెవెన్యూ డివిజన్‌లోకి మార్చవద్దని, గజ్వేల్‌రెవెన్యూ డివిజన్‌లో ఉండాలని సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మాణం చేసారు. రాయపోల్ మండలంలోని అన్ని గ్రామాలు గజ్వేల్ పరిసర ప్రాంతాల్లోఉన్నాయని పది కిలోమీటర్లలోపు ఉన్న మండలాన్ని గజ్వేల్ రెవెన్యూ డివిజన్ నుంచి మార్చి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుబ్బాక కలపడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపిడివో బాలయ్య,తహసీల్దార్ దివ్య,విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం వల్ల మహిళలు ఆటోలను ఎక్కడం లేదని, తమ జీవనోపాధిపై పెను ప్రభావం ఏర్పడి అల్లాడుతున్నామని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం నాడు మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాలో మెదక్-చేగుంట రహదారిపై సీఎం దిష్టిబోమ్మతో నిరసన వ్యక్తం చేశారు. ఫైనాన్స్‌లో ఆటోలను తెచ్చుకున్నామని, ఆటోలో ఎవరూ ఎక్కకపోవడంతో ఫైనాన్స్ కట్టడానికి కూడ డబ్బులు లేవని, కుటుంబంతో సహా రోడ్డున పడ్డామని వారు రోదిస్తూ తెలిపారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.


మెదక్-చేగుంట రహదారిపై నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

## జీవకోటికి సూర్యభగవానుడు ప్రత్యేక దైవం

-యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందితుంది



సామూహిక సూర్యనమస్కారాలు చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
పాచ్యాత్య పొకడకలకు అకర్షితులు కాకుండా సనాతన ధర్మంలో పూర్వీకులు పేర్కొన్న యోగ అభాస్యంతో అరోగ్య వంతమైన జీవనం కొనసాగించ వచ్చని పతంజలి యోగ సమితి, యువభారత్ జిల్లా అధ్యక్షులు పెద్ద మనోహర్ అన్నారు. రథ సప్తమి పురస్కరించుకొని పతంజలి యోగ సమితి, యువ భారత్ అధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో సరస్వతి శిశుమందిర్‌లో సామూహిక సూర్యనమస్కారాల సాధన కార్యక్రమం నిర్వహించారు. యోగ గురువు బొజ్జ అశోక్ అధ్వర్యంలో సూర్య నమస్కార శ్లోకాలను పఠిస్తూ 12 సార్లు సూర్యనమస్కారాల సాధన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జీవకోటికి సూర్యభగవానుడు ప్రత్యేక దైవం అన్నారు. మానవ మనగడలో అహారంతో పాటు సూర్యరశ్మి కీలకం అన్నారు. ప్రతి ఒక్కరూ యోగ అభ్యాసం చేయాలన్నారు. యోగ సాధనతో శారీరక, మానసిక అరోగ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి కత్తుల బాపురెడ్డి, పతంజలి యోగ ప్రతినిధులు డా॥కృష్ణమూర్తి, తిప్పర్తి భాస్కర్, జూలురి రవికుమార్,కాపర్తి రాములు, కనకరాజు, గోపిశెట్టి బిక్షపతి, అయిత కాశీనాథ్, దేవేందర్‌గౌడ్, భాస్కర్, నవీన్, ప్రభుదాస్, హన్మంతరెడ్డి, మల్లేశం, రాజు, తోట రమేష్ పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపిక

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**
సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డి గూడెంలో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగే 33వ సబ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అక్బర్‌పేట-భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతికి చెందిన బోయిని వెన్నెల ఎంపికైనట్లు పిఈటి వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికైన వెన్నెలను హెచ్ఎం, ఉపాధ్యాయులు రాజేందర్, రవిశేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భూపాల్, దయాసాగర్‌రెడ్డి, ప్రకాష్, భాగమ్మ, పద్మావతి, మేఘమాల,పెంటయ్యలు అభినందించారు.

### సమస్యలను తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని మోడల్ స్కూల్‌ను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలోని మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అయన వెంట పార్టీ నాయకులు మద్దెల రాజేశం, హర్షద్,కిష్టయ్య, కాశంబోయిన భాస్కర్, మహమ్మద్ జహంగీర్, మహేష్, ఎల్లం, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఘనంగా స్వయం పాలన దినోత్సవం

**నంగునూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పాలమాకుల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తోటి విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థులకు విద్య బోధన చేశారు. కలెక్టర్‌గా కవ్వం రామకృష్ణారెడ్డి, డీఈఓగా శ్రీ హర్షిత్, ఎంఈవోగా ఎం.డి.రాజ్వాన్, ఎంపిడిఓగా జిగురు సాత్విక్, తహశీల్దార్‌గా దరశిశ్వర్, పిఈటిగా శివ గణేష్, అటెండర్లుగా సాయిచరణ్, అరవింద్‌లు వ్యవహరించారు.

### రవీంద్ర హైస్కూల్‌కు జిల్లా స్థాయి సైన్స్ అవార్డులు



అవార్డులకు ఎంపికైనా విద్యార్థులు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నాలుగు పాఠశాలల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ అవగాహన కార్యక్రమాలలో రవీం ద్ర హైస్కూల్‌కు చెందిన ఎం.వైష్ణవి, ఏ.శ్రీశివ ఇద్దరు జిల్లా సైన్స్ ప్రేరణ 2023-24 అవార్డులకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.హరికిషన్ తెలిపారు. అవార్డుకు ఎంపికైనా విద్యార్థులను అయన అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులకు అవార్డులు వచ్చేలా తర్ఫీదు ఇస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు శ్యాంకుమార్,అరీఫ్, కృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### హుస్నాబాద్ ఎంపిడివోగా వేణుగోపాల్‌రెడ్డి



ఎంపిపి మానసను పుష్పగుచ్చం అందిస్తున్న ఎంపిడివొ

**హుస్నాబాద్,ఫిబ్రవరి16,ప్రభాతవార్త**
హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ అధికారిగా శుక్రవారం రోజున వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.గతంలో హుస్నాబాద్ ఎంపిడివోగా విధులు నిర్వహించిన కుమారస్వామి లాంగ్ లీవ్‌పై వెల్లడంతో కోహెడ సూపరిండెంట్‌గా విధులు నిర్వహించిన రఘురాంరెడ్డికి హుస్నాబాద్ ఇంచార్జ్‌గా విధులు అప్పగించారు.నూతన ఎంపిడివోగా వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడంతో ఇంచార్జ్‌గా ఉన్న రఘురాంరెడ్డి కోహెడ సూపరిండెంట్‌గా తిరిగి ఆయన విధుల్లో చేరారు.నూతన ఎంపిడివోగా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌రెడ్డి హుస్నాబాద్ ఎంపిపి లకావత్ మానసను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపివొ సత్యనారాయణతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గిరిజన గురుకులాల్లో సివోఈ ప్రవేశ పరీక్ష

**నర్సాపూర్,ఫిబ్రవరి 16.ప్రభాతవార్త:**
గిరిజన సంక్షేమ గురుకులాల విద్యాలయ సంస్థ పరిధిలో ప్రతిబా జూనియర్ కళాశాలలో ప్రవేశం నిమిత్తం ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ ఆర్సీ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్ లో గల అల్లూరి సీతారామరాజు గురుకులంలో343 మంది,కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరంపల్లిలో గల గురుకుల డిగ్రీ కళాశాలలో330 మంది,నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి లోని ఎట్ తిర్మన్‌పల్లి గిరిజన గురుకుల పాఠశాలలో 258 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష కు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్టుతో పాటు ఆధార్ కార్డు నీలం,నలుపు రంగు పెన్నులు, పరీక్ష ప్యాడ్ లు తీసుకొని ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు.ఈ పరీక్షా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

# సిద్దిపేట జిల్లాను పదవ తరగతి ఉత్తీర్ణతలో మొదటి స్థానంలో ఉంచాలి

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

**రాయపోల్,ఫిబ్రవరి16 ప్రభాతవార్త**
పదవ తరగతి ఉత్తీర్ణతలో సిద్దిపేట జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.శుక్రవారం రాయపోల్ మండలంలోని ప్రాథమిక పాఠశాల మంతూర్, అనాజీపూర్,రాంసాగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామారం,రాయపోల్‌కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులను సబ్జెక్టు వారిగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ..పదవ తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శద్ద వహించి ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు.మండల పరిధిలో ఉపాధ్యాయులు అందరూ సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారినర్సమ్మ,మండల నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి,సిఆర్పిలు స్వామిగౌడ్, ఎల్లాగౌడ్,కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

# మొగి పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

-మండల వ్యవసాయాధికారి వసంతరావు



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ వసంతరావు

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):**
ప్రస్తుతం యాసంగి వరి సాగులో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దాని నివారణకు రైతులు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వసంతరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అలిరాజపేట, తీగుల్, మునిగడప, వట్టిపల్లి, బస్వాపూర్, చాట్లపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులో మొగి పురుగు ఉధృతి తెలుసుకునేందుకు రైతులు ముందుగా ఎకరానికి మూడు నుంచి ఐదు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల పురుగు ఉధృతి తెలుసుకొని సస్యరక్షణ చర్యలు చేపట్టి పురుగు ఉధృతిని నివారించవచ్చన్నారు. అదేవిధంగా కాండం తొలుచు పురుగు నారుమడి దశలోనే నివారించేందుకు రైతులు 3జి గుళికలు చల్లుకోవాలని, అదేవిధంగా నాటు వేసే సమయంలో వరి కొనలు త్రుంచి నాటాలన్నారు. ప్రతి రైతు వరి సాగు చేసేటప్పుడు 2.5 మీటర్లు లేదా 3 మీటర్ల మధ్యలో తూర్పు, పడమర దిశగా కాలి బాటలను వదులుకోవాలన్నారు. ఈ బాటల వల్ల మొక్కలకు ఎక్కు మొత్తంలో ఆక్సిజన్ అందడంతో పాటు ఎరువులు చల్లుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఎలుకల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. ప్రస్తుతం మొగి పురుగు నివారణకు నాటు వేసిన 15 రోజుల్లో ఎకరానికి కార్బోఫ్యురాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా కాటాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రా నిలిప్రోల్ 4జి గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి వరి పంటలో చల్లుకోవాలని సూచించారు.

**యూరియాతో కలిపి గుళికలు చల్లితే ఎలాంటి ప్రయోజనం ఉండదు**
ప్రస్తుతం రైతులు మొగి పురుగు నివారణకు సిఫార్సు చేయబడిన 10జి గుళికలు కానీ ఇతర సేంద్రీయ గుళికలు యూరియాతో కలిపి చల్లుతున్నారని, అలా చల్లితే పంటకు ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. అదేవిధంగా వరి చిరు పొట్ట దశలో రెక్కల పురుగు ఉధృతి గమనించినట్లయితే కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 50 శాతం ఎస్‌పి 2 గ్రాములు లీటరు నీటికి కలిపి ఎకరానికి 400 గ్రాములు పిచికారి చేసుకోవాలని అన్నారు. యాసంగి పంటలో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కృష్ణమూర్తి, రైతులు స్వామి, అజయ్, వివిధ క్లస్టర్ల ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తాం



ప్లకార్డులతో నిరసన తెలిపి విద్యుత్ ఎస్ఈకి వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
దేశ వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, సమ్మెలో పాల్గొనడంతో మద్దతుగా శుక్రవారం సిద్దిపేటలో విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తమ సంఘీభావం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడంతో వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులందరూ పెద్ద యెత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటికరణ చేయొద్దని 2022 విద్యుత్ సాధన చట్టాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎస్‌పీఈ జెఏసి నాయకులు భద్రయ్య, గంగాధర్, హుస్సేన్, శ్రీనివాస్, చంద్రారెడ్డి, రవిప్రసాద్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్,ఫిబ్రవరి16,ప్రభాతవార్త :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతు,కార్మిక,ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ మండిపడ్డారు.శుక్రవారం భారత్ బంద్‌కు మద్దతుగా సిపిఐ,బిఎస్‌పి పార్టీల నాయకులు హుస్నాబాద్‌లో రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పచ్చిమట్ల రవిందర్‌గౌడ్, బిఎస్‌పి నాయకులు శంకర్,వేల్పుల రాజు,శరత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**-కార్మిక వ్యతిరేఖ చట్టాలను ఉపసంహరించుకోవాలి...**
దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా కార్మిక ప్రవేశపెట్టిన కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని,తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలలో కార్మికులకు ప్రత్యేక కోటాను కేటాయించాలని డామాండ్ చేశారు.వారందరికి 25లక్షల ప్రమాద భీమా కల్పించాలన్నారు.

## వచ్చే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు : సీఐటీయూ

**పటాన్‌చెరు,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:**
వచ్చే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ అన్నారు. కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చా సంయుక్త సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమ్మె, గ్రామీణ బంద్‌ను పురస్కరించుకొని పటాన్‌చెరులోని శ్రామిక భవన్ నుండి ఆర్టీసి బస్టాండ్ జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మల్లికార్జున్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తి అయిన రైతాంగ, కార్మికుల,ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోయిందని, విమర్శించారు. బిజెపి అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. బిజెపి నరేంద్ర మోడీ విధానల వల్ల కార్పొరేట్ శక్తుల లాభాలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి కుటుంబానికి 15లక్షల రుపాయల డిపాజిల్ చేస్తామన్న మటాను మర్చిపోయారని అన్నారు. అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. 12 గంటల పని రోజులను అమలులోకి తెచ్చిందని, కార్మికులకు కనీస వేతనం 26 వేల రుపాయలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతాంగంకు గిట్టు బాటు ధర కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. దేశ రాజధాని ఢీల్లిలో రైతాంగ ఉద్యమం జరుగుతుంటే తూటాలతో ఉద్యమాన్ని అణచి వేస్తుందన్నారు. ఆశా, అంగన్‌వాడీ,మున్సిపల్ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు లేవని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంను అన్ని గ్రామాలకు పనులు ఇచ్చి, 300 రోజులు పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల మధ్య మతాలు, కులాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం దారుణమన్నారు. అనేక హామీలతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తుందని, అందుకోసం వచ్చే ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి పాండు రంగారెడ్డి, ఎండి వాజిద్ అలి, బి నాగేశ్వరరావు, పరిశ్రమ కార్మికులు ఆశా, అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులు, హమాలి కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియూ నాయకులు

## బదిలీలను సజావుగా నిర్వహించాలి

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలను సజావుగా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య సూచించారు. శుక్రవారం నాడు ఆయన చిన్నశంకరంపేట పట్టణంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాఠశాలలో పారిశుద్య కార్మికులు లేక విద్యార్థులు,ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు ఉచిత విద్యుత్తు, అంతర్జాలం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య

**పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్**

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కాసులాబాద్‌లో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ శుక్ర వారం పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు అధికంగా ఉండడం వలన రైతులు యాజమాన్య పద్దతులను అవలం భించాలన్నారు. పిలక దశలో ఉన్న వరి పైరుకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3 జి గూలికలు,10 కిలోలు లేదా కార్తప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు, 8 కిలోలు చల్లుకోవాలన్నారు. చిరు పుట్ట దశలో పురుగు ఉధృతి గమనించినట్లయితే కర్తప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్పీ 2 జీఆర్ లీటర్ లేదా క్లోరంట్రా నిలిప్రోల్ 0.3 ఎంఎల్ లేదా ఇసోసైక్లో సిరం 0.6 ఎంఎల్ ఒక లీటర్ నీటి కలిపి పిచికారి చేసు కోవాలన్నారు. వరిలో యూరియా వాడకాన్ని అధిక మోతాదులో ఒకేసారి కాకుం డా దఫాదపాలుగా వాడటం వలన అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఫర్టిలైజర్ దుకాణాలలో 10 టన్నుల ఎరువులు ఎప్పుడు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. వరిలో గంధక ప్రభావం వలన వేర్లు కుళ్లి వాసన రావడం జరుగుతుందని నివారణకు హెక్సా కొనాజోల్ లేదా కాపర్ అక్సిక్లోరైడ్ మం దులను వినియోగించాలన్నారు.

## ఎలక్ట్రికల్ ట్రై సైకిల్స్ దగ్ధం

**కొండపాక, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**
జుప్రమాదవశాత్తు దివ్యాంగులకు సంబందించిన ఎలక్ట్రికల్ ట్రై సైకిల్స్ దగ్ధమైన సంఘటన రాజీవ్ రహదారి పై లకుడారం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. హైదరాబాద్ నుండి మంచిర్యాల కలెక్టర్ కారాలయనికి టాటా ఎసి వాహనంలో తీసుకువెళ్తుండగా బ్యాటరీలు పెలి ఒక్కసారిగా ట్రై సైకిల్స్ కాలి బుడిదైనట్లు తెలిపారు. ఈ వాహనాలు బ్యాటరీ సహాయంతో నడిచేవి కావడంతో బ్యాటరీలు పేలినట్లు అనుమానిస్తున్నారు. వాహనంలో మొత్తం 10 ఎలక్ట్రికల్ ట్రై సైకిల్స్ తీసుకెళ్తుండగా అందులో 6 పూర్తిగా కాలి బుడిదైనట్లు తెలిసింది. ఈ విషయమై కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా తనకు ఏలా ంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



కాలి బుడిదైన ఎలక్ట్రికల్ ట్రై సైకిల్స్

## కేంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

-టిపిసిసి సభ్యులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు చంద్రం, రాజు



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**
కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతులకు మద్దతు ధర ఇవ్వాలని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కో-అర్డినేటర్ దాసరి రాజులు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో కే ంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇవ్వాలని నిరసన తెలుపుతూ రాజ్యాంగ నిర్మాత డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ తీరుపై వారు మండిపడ్డారు. ప్రధాని మోడీ జ్ఞానం తెచ్చుకొని రైతులకు పంట మద్దతు ధర చెల్లించి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రధాని మోడీ రైతుల పట్ల వ్యవహారిస్తున్న తీరు సరికాదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులను రోడ్ల మీదికి తెచ్చే పరిస్థితి కల్పించిన మోడీ ప్రభుత్వాన్ని అ రైతులు గద్దె దించుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు కొండలవాడి సతీష్, బడికోల్ రాకేష్ యాదవ్, పిల్లి మహేష్, సంపత్, చెక్కిల తరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మనవరాలి అన్న ప్రసాన రోజు ప్లేట్ల పంపిణీ

**కొండపాక, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**
మనవరాలు అర్యా అన్న ప్రసాన కార్యక్రమం సందర్భంగా సంతోషంతో నానమ్మ పాఠశాల విద్యార్థులకు మద్యాహ్న బోజనం చేయడానికి ప్లేట్లు పంనిణీ చేశారు. దుద్దెడ ఉన్నత పాఠశాలలో అంగ్లం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు ఎం. కిరణ్మయి అమె భర్త విజయ కుమార్ దంపతులతో పాటు కొడుకు మనోజ్ కుమార్, కొడలు శ్రీవాణితో కలిసి కిరణ్మయి మనవరాలు అర్యాకు అన్న ప్రసాన చేసిన సందర్భంగా సంతోషంతో అమె కుటుంబ సభ్యులు 220 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. అదే విధంగా లైబ్రరీ కొరకు పెన్నులు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, ఉపాధ్యాయ బృదం కిరణ్మయి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



డ్రామా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ్న ఉపాధ్యాయులు

**కొండపాక, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను అన్ని రంగాల్లోను రాణించాలని దుద్దెడ హెచ్ఎం లక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి డ్రామా పోటీల్లో విజయం సాధించిన దుద్దెడ ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందించి అమె మాట్లాడారు. ఇంగ్లీష్ ల్యాంగేజ్ టీచర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా వారు సిద్దిపేటలోని ఇందిరనగర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి డ్రామా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు.విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధించి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. విద్యార్థులను డ్రామా పోటీలకు సిద్దంగా చేసిన ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కిరణ్మయి, చంద్రభాను, యాదగిరిలను అమె అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పి. యాదగిరి, రజిని, భారతి, హైమావతి, రాధాకృష్ణ, శ్రీదేవి, అరుణ, ఉమారాణి, తిరుపతి, కిషన్, జానకీ, కృష్ణమూర్తి, అమీద తదితరులు పాల్గొన్నారు.

### జగదేవ్‌పూర్ గాంధీ నరసింహరామయ్య పంతులు వర్ధంతి



జగదేవ్‌పూర్‌లో నరసింహరామయ్య పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):**
జగదేవ్‌పూర్ గ్రామానికి ఎన్నో సేవలు అందించి జగదేవ్‌పూర్ గాంధీగా పేరుగాంచిన జగదేవ్‌పూర్ మాజీ సర్పంచ్ నరసింహరామయ్య పంతులు 19వ వర్ధంతి వేడుకలను గ్రామ ప్రజలు, ఏఎన్ఆర్ పీపుల్స్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ ప్రజలు, నరసింహరామయ్య కుటుంబసభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీపుల్స్ ట్రస్టు ప్రతినిధి శశిధర్‌శర్మ మాట్లాడుతూ జగదేవ్‌పూర్ ప్రజల కోసం నిరంతరం పనిచేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన నరసింహరామయ్య పంతులు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మాజీ సర్పంచ్‌లు బుద్ద వెంకటయ్య, కొంపల్లి కరుణాకర్, నరసింహరామయ్య పంతులు కుటుంబసభ్యులు చిదంబరం, గ్రామ నాయకులు బుద్ద మహేందర్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పనగట్ల శ్రీనివాస్‌గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు పేర్ల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుబ్బ శ్రీనివాస్‌రావు, నరసింహారెడ్డి, కందుల బాలరాజు, పేర్ల సత్తయ్య, బుద్ద నాగరాజు, కొంపల్లి మహేష్, ఎస్.వెంకట్‌రెడ్డి, అబ్బూమియా, జూనియర్ కళాశాల అధ్యాపకులు వాడకట్టు శ్రీనివాస్, ఏఎన్ఆర్ పీపుల్స్ ట్రస్టు ప్రతినిధులు వంశీధర్, శ్రీధర్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## కులగణన చారిత్రాత్మక నిర్ణయం

-బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి



మాట్లాడుతున్న చెప్యాల తిరుపతి

**హుస్నాబాద్,ఫిబ్రవరి16,ప్రభాతవార్త**
కలగణన అనేది చారిత్రాత్మక నిర్ణయం అని బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చేర్యాల తిరుపతి అన్నారు.శుక్రవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం సంఘం ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి తిరుపతితో కలసి మాట్లాడుతూ శాసనసభలో బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన కులగణన తీర్మానానికి ఏకగ్రీవ తీర్మాణం ఆమోదం చెందడం రాష్ట్ర సమగ్ర అభివృద్దికి తొలిమెట్టు అన్నారు.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బిసిసంక్షేమ సంఘం తరుపున స్వాగతిస్తున్నాయన్నారు.శాసనసభలో బిసి బిల్లు ప్రవేశపెట్టి ఆమోదానికి కృషి చేసిన ప్రభుత్వానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా కులగణన చేపట్టడం శుభపరినామమన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కొట్ట శివర్ధన్‌రెడ్డి

**కేశంపేట, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మంగలిగూడెం గ్రామానికి చెందిన దిద్దెల శంకరయ్య కుమారుడు శివకుమార్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించాడు. విషయం తెలుసుకున్న కొట్ట శివర్ధన్‌రెడ్డి శివకుమార్ కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని అందించి తన వంతుగా 10000 వేల రూపాలయలను శివకుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

## సమాచార బోర్డుపై మారని అధికారి పేరు

### 8 నెలలుగా అదేపేరుతో సమాచారబోర్డు

### అధికారుల నిర్లక్ష్యమా? లేక అభిమానమా?




సమాచార బోర్డుపై బదిలీ అయిన అధికారి పేరున్న దృశ్యం

**బషీరాబాద్, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహించి గత సంవత్సరం మే 24న (10 నెలల క్రితం) బదిలీపై వెళ్లిన విద్యాచరన్‌రెడ్డి పేరు పౌరసమాచార బోర్డులో చెరగని గుర్తుగా నిలిచిపోయింది. ఆయన బదిలీ అనంతరం వేణుగోపాల్ గౌడ్ జూన్ 24 నుంచి ఫిబ్రవరి 1 (8నెలలు) వరకు బాధ్యతలు నిర్వహించి ఆయన సైతం బదిలీపై వెళ్లారు. అయన స్థానంలో బషీరాబాద్ ఎస్ఐ రమేష్ 07 జూన్‌లో బాధ్యతలు చేపట్టి వారం రోజులు గడుస్తున్నా పౌరసమాచార అధికారిగా మాత్రం విద్యాచరణ్‌రెడ్డి పేరు దర్శనం ఇస్తుండటం అధికారుల అలసత్వమా? లేక సిబ్బంది గుండెల్లో చెరగని గుర్తుగా ఉండిపోయా రా? అనే సందేహం వ్యక్తం అవుతుంది. పలు ఫిర్యాదులుకై పోలీస్‌స్టేషన్ వస్తున్న ఫిర్యాదు దారులు సమాచార బోర్డు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఎనిమిది నెలల క్రితమే బదిలీపై వెళ్లిన అధికారిపేరు తొలగించి ఆ స్థానంలో కొత్తగా వచ్చిన పౌరసమాచార అధికారి పేరుతో బోర్డు ఏర్పాటు చేయ కపోవడంతో అధికారుల పనితీరుపై పలువురు విమర్శలు గుప్పిస్తు న్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవం

తలకొండపల్లి, ఫిబ్రవరి 16ప్రభాతవార్త



శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణోత్స వాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళాణాన్ని ప్రకాష్‌దంపతులు, నవీన్‌దంపతులు, మల్లేష్ దంపతులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు యాదయ్య సాయిలు నరసింహ పాండు చెన్నకశవస్వామి భక్త బృందం పాల్గొన్నారు. బండిపాండు దంపతులు అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని వేదమం త్రాలతో మహేష్ ఆయ్యగారు జరిపించారు.

## జిల్లా అభివృద్ధి పట్నం కుటుంబంతోనే సాధ్యం

### రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్ రెడ్డి



జెడ్పి చైర్‌పర్సన్ సునీతారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నా ఎంపీటీసి శ్రీకాంత్‌రెడ్డి

**బంట్వారం, ఫిబ్రవరి 16,(ప్రభాత వార్త ) :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందాలన్న పట్నం కుటుంబంతోనే సాధ్యమని బంట్వారం మండలం రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదారాబాద్‌లోని గాంధీ భవన్ లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డితోపాటు ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ... అయితే గత ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి ఎంపీటీసీ టికెట్ ఆశించిన, తనకు అప్పటి ఎమ్మెల్యే ఆనంద్ టికెట్ ఇవ్వలేదన్నారు. దీంతో స్వ తంత్ర అభ్యార్థిగా పోటీలో దిగి, ఎన్నికల్లో గెలుపొందానన్నారు. అనం తరం బీఆర్ఏస్ పార్టీలో కొనసాగుతున్నారు. నేడు జిల్లా పరిష త్ చైర్ పర్సన్ సునీతరెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆమెతో పాటు కాంగ్రెస్ లో చేరామన్నారు. ఏది ఏమైనా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభియువృద్ధి చెందాలన్నా, మారుమూల గ్రామాలు సైతం మరింత అభివృద్ధిపథంలో నడవాలన్న ఇలాంటి నాయకురాలుతో సాధ్యమని, తాము సైతం అభివృద్ధిని ఆకాంక్షించి ఆమెతోనే తమ ప్రయాణమని చెప్పుకొచ్చారు. ఈయన వెంట మాజీ ఎంపీటీసీ రమేష్ ఉన్నారు.

## తాండూరు డిఎస్పీగా బాలకృష్ణారెడ్డి బ్యాధతలు

**తాండూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**

తాండూరు సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. ఇక్కడ పనిచేసిన డిఎస్పీ శేఖర్‌గౌడ్ నుంచి శుక్రవారం నూతన డిఎస్పీగా బాలకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాండూరు సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని తెలిపారు. మరోవైపు తాండూరు డిఎస్పీగా పనిచేసిన శేఖర్‌గౌడ్ డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయనున్నట్లు తెలిసింది.

# నర్సాపూర్ అభివృద్ధికి పాలక వర్గం కృషిచేయాలి

## మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**నర్సాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ పాలక వర్గం సభ్యులందరు కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్ వార్షిక బడ్జెట్ ప్రతిపాదన కోసం ప్రత్యేక సమావేశాన్ని చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అధ్యక్షతనలో నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొనగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తోపాటు బదిలీ అయిన మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, నూతన కమిషనర్ జైత్‌రాంనాయక్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ జైత్‌రాంనాయక్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టగా అకౌంటెంట్ వెంకట్‌రావు బడ్జెట్ కు సంబందించిన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ కృషి చేయాలన్నారు. రాబోయే వేసవి కాలంలో నర్సాపూర్ పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నర్సాపూర్ పట్టణంలో కోతులు, వీధికుక్కల బెడద తీవ్రంగా ఉన్నందున ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కోతుల, వీధికుక్కల బారి నుండి ప్రజలను కాపాడేందుకు, వాటిని నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ తాగునీటి, పైప్ లైన్‌ల ఏర్పాటు విషయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ మాట్లాడుతూ పట్టణంలో కోతుల, కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలన్నారు. అదేవిదంగా మెదక్ రోడ్డులో ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ సంగసాని సురేశ్ మాట్లాడుతూ నర్సాపూర్‌లో మిషన్ బగీరథ నీటి సరఫరా సక్రమంగా రావడం లేదని పైప్‌లైన్ పాడైనందున కొత్తగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కౌన్సిలర్ ఎరుకలి యాదగిరి మాట్లాడుతూ నర్సాపూర్‌లో జనాభా పెరిగినందున ఒక శ్మశానవాటిక సరిపోవడంలేదని అదనంగా మరొకటి ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు సహకరించాలన్నారు. అదేవిధంగా సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**మున్సిపల్ వార్షిక బడ్జెట్‌కు సభ్యుల ఆమోదం**

నర్సాపూర్ మున్సిపల్ వార్షిక బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ జైత్‌రాం నాయక్ ఆధ్వర్యంలో అకౌటెంట్ వెంకట్‌రావు బడ్జెట్ వివరాలు వివరించారు. ఈమేరకు 2024-25 సంవత్సరానికి అంచనా వేసిన బడ్జెట్ మొత్తం ఆదాయం సాధారణ నిధులు గ్రాంట్లు కలుపుకొని రూ. 4088.82 లక్షలు, అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనావేసిన మొత్తం వ్యయం రూ. 4052.78 లక్షలు, ఈ సంవత్సరానికి అంచనా వేసిన మున్సిపల్ సాదారణ ఆదాయం రూ. 697.82 లక్షలు, ఆదాయం గ్రాంట్ల ద్వార 3382.00 లక్షలు, అదేవిదంగా అంచనా వ్యయం గ్రాంట్ల ద్వార రూ. 3382,00 లక్షలు, 2024-25 సంవత్సరానికి గాను 10 శాతం గ్రీన్ బడ్జెట్ కోసం కేటాయించిన సాదారణ నిదులు 66.18 లక్షలు,అదేవిదంగా చార్జెడ్ వ్యయం కోసం సాదారణ నిధులు 429.93 లక్షలు కేటాయించారు. ఈ సంవత్సరానికి గాను 1 బై3 బ్యాలెన్స్ బడ్జెట్ కోసం కేటాయించిన సాధారణ నిధులు 36.24 లక్షలు కేటాయించడం జరిగింది.2024, 2025 సంవత్సరానికి మిగుల బడ్జెట్ 36.04 లక్షలుగా నర్సాపూర్ మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ బడ్జెట్ సభ్యులందరి ఆమోదం పొందింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్, సంగసాని సురేశ్, గోద రాజేందర్, ఎరుకలి యాదగిరి, సునీతాబాల్‌రెడ్డి, లతారమేశ్ యాదవ్, గొల్ల రుక్కమ్మ, ఇష్రత్ సిద్దిఖి, మున్సిఫల్ ఏఈ కిష్టయ్య, మేనేజర్ మధుసూధన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## గీతం అంతార్జాతీయ సదస్సులో స్పష్టం చేసిన వక్తలు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరూసామాజిక బాధ్యతగా పర్యావరణ హిత చర్యలు చేపట్టాలని వక్తలు సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని అకౌంటింగ్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ సామాజిక పాలనలో సమకాలిన సమస్యలు అనే అంశంపై శుక్రవారం రెండురోజుల అంతర్జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా ప్రారంభించారు. అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నాబార్డుల సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిధులుగా నాబార్డు జనరల్ మేనేజర్ పీటీ ఉష, అరబిందో ఫార్మా సలహాదారు డాక్టర్ జేవీఎన్ రెడ్డిలు పాల్గొనగా, ఐఎంసీ కార్య నిర్వాహక డైరెక్టర్ తెరసా జాకబ్స్ కీలకోపన్యాసం చేశారు. ఈ ఎస్జీ సమకాలిన స్వభావాన్ని, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను ఉష ప్రస్తావించడంతో పాటు గ్రామీణ ప్రాంతాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్వయం సమృద్ధి కోం నాబార్డు చేపడుతున్న పలు పథకాలను ఆమె ఏకరువు పెట్టారు. ఈఎస్జీపై తన ఆలోచనలను జేడీఎసన్ రెడ్డి సదస్సులతో పంచుకోవడంతో పాటు అన్ని పరిశ్రమలలో సుస్థిరత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అరబిందో ఫార్మ పరిశ్రమలలో చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలు, సౌర విద్యుత్ వినియోగం వంటి పలు అంశాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ప్రతి ఒక్కరు ప్రకృతిక వనరులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని, ఈ భూమిని కాపాడుకోవడానికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈఎస్జీలో వ్యక్తిగత భాధ్యత, పాలనా సూత్రాల శక్తిని తనదైన శైలిలో తెరెసా జాకబ్స్ వివరించారు. ప్రతిపౌరుడు తన సామాజిక భాధ్యతలో భాగంగా పర్యావరణ హిత కార్యకలాపాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్పోరేట్ వ్యూహాలు, పెట్టుబడి నిర్ణయాలు సామాజిక పురోగతిలో ఈఎస్జీకి పెరుగుతున్న ప్రాముఖ్యతలను గీతం బీ-స్కూల్ ఇంచార్జి డైరెక్టర్ దివ్య,కిర్తి,గుప్తా, నొక్కి చెప్పారు. ఈ రంగంలోని సవాళ్లు అవకాశాలపై అర్థవంతమైన చర్చ, విభిన్న దృక్కోణాలను ఆవిష్కరించడం కోసం ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ రెండు రోజులు అంతర్జాతీయ సదస్సు నిర్వాహకుడు డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్ వందన సమర్పణతో ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసింది. శనివారం వరకు కొనసాగనున్న ఈ సదస్సులో భాగంగా, ఈఎస్జీపై చర్చాగోష్టులు, నిపుణులతో ప్రసంగాలను నిర్వహిస్తున్నారు.



పర్యాటవరణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు,ఉపాధ్యాయ బృంధం

## పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**కొడంగల్,ఫిబ్రవరి 16ప్రభాతవార్త** కొడంగల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్వయం పరిపాలన దినో త్సవంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారాఇ తోటి విద్యార్థులకు చక్కటి బోధనతో అలరించారు. డీఈఓ, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరిస్తు తోటి విద్యార్థులకు పాఠాలను బోధిం చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఈఓ రాంరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృంధం పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్



విలేకరులతో మాట్లాడుతున్న గిరిజనే సంఘం నాయకులు

**కొడంగల్,ఫిబ్రవరి 16ప్రభాతవార్త** గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందులో భాగంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గిరిజనులకు వరాల జల్లు కురిపించారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఐబిలో గిరిజన సంఘం నాయకులు సేవాలాల్ సంఘం సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గురువారం కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు వివిధ గిరిజన తండాల నుంచి తరలివచ్చిన గిరిజన బంజారా సోదరులు విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి సహకంచిన దాతలు సుభాష్‌నాయక్,దేవులానాయక్‌లకు సేవాలాల్ ఉత్సవ కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శివచౌహన్, నేవే నాయక్,హనుమంతు నాయక్,చంద్రానాయక్,సంతోష్‌నాయక్, రవినాయక్, దత్తునాయక్,గోపాల్ నాయక్,దేవదాస్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

## ఆటో డ్రైవర్లకు జీవనభృతి చెల్లించాలి

### ఆటో యూనియన్ అధ్యక్షుడు కుర్వ హన్మంతు

**పెద్దేముల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్లకు ప్రతి నెల జీవనభృతి చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు కుర్వ హన్మంతు, కార్యదర్శి నవీన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆటో యూ నియన్ సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ ప్రదాన చౌరాస్తాలో ఆటో యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్లు రాస్తారోకో నిర్వ హించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆటోలలో ఎక్కువగా ప్రయాణించేంది స్త్రీలు మాత్రమేనని, వారికి బస్సులలో ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించడంతో తమ పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. తాము నెల నెల ఈఎంఐలు చెల్లించాలని, అందుకు తమ ఆటో లో ఎవరు ప్రయాణించక తమ బతుకులు ఆగమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోలు నడవక తమ పిల్లలకు చదివించడానికి కష్టతరంగా మారు తోందని, అంతేగాకుండా పూట గడపటానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. తమ పరిస్థితి బాగుపడేలా ప్రభుత్వం ఒక్కో ఆటో డ్రైవ రుకు ప్రతి నెల రూ. 15 వేలు జీవనభృతి చెల్లించేలా కృషిచేయాలని విన్న వించారు. ఆటో డ్రైవర్లు అంజాద్, మంగలి పాండు, కుర్వ మల్లప్ప, రూప్‌ఖా న్‌పేట్ నరేష్ పూరి జగన్,కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా యెన్కెపల్లిలోని

## శ్రీ నాగులమ్మ విగ్రహ పునః ప్రతిష్టాపన

**మొయినాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలం యెన్కె పల్లిలోని శ్రీనాగులమ్మ విగ్రహ పునప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగవైభవంగా బుధవారం ఉదయం ఎలగని సత్య నారాయణ ఆధ్వర్యంలో జరగింది. గ్రామ ప్రజలు అంతా తరలి వచ్చి అమ్మవారికి మొక్కలు చెల్లించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా గురువారం హోమం, పూజ, అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు పంటలు పొలాలు మంచిగా ఉండాలి అంటే గ్రామదేవతలను పూజించాలని అన్నారు. గ్రామంలో ఉన్న వారు సుఖశాంతులతో ఉండాలి అంటే గ్రామ దేవతలకు పూజలు చేసి నైవేద్యం సమర్పించాలని చెప్పారు. నాగులమ్మ విగ్రహ పున ప్రతిష్టాపన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి నాగులమ్మ దేవతకు పూజలు చేసి కొబ్బరికాయ కొట్టారు.

## మేడ్చల్‌లో ప్రశాంతంగా భారత గ్రామీణ బంద్

**మేడ్చల్, ఫిబ్రవరి 16. ప్రభాతవార్త :** భారత గ్రామీణ బంద్ పేరుతో నిర్వహించిన సమ్మె కార్యక్రమం మేడ్చల్ ప్రశాంతంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ ఆర్టీసీ డిపో నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సిఐటియు ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్య క్షుడు అశోక్, నాయకులు నరేష్, కొమురయ్య, నర్సింగ్‌రావు, శ్రీలత, పద్మ, వసంత, ప్రేమలత, విజయ, భాగ్యమ్మ, మల్లేష్, ప్రవీణ్, పెంటయ్య, నరేష్ సుధాకర్, లీలమ్మ, నర్సమ్మ, యాదగిరి, అంగన్‌వాడి, ఆశ, మద్యాహ్న భోజన, గ్రామ పంచాయతీ, మున్సిపల్, ప్రైవేట్ పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన వనం లక్ష్మికాంత్‌రెడ్డి

**చేవెళ్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, చేవెళ్ల నియోజకవర్గం బీఆర్ఎస్ మాజీ యూత్ అధ్యక్షులు వనం లక్ష్మికాంత్‌రెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరారు. శుక్రవారం గాంధీ భవన్‌లో వికారాబాద్ జడ్పి చైర్ పర్సన్ సునితారెడ్డి, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి దీపాదాస్ మున్సి, రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రముఖుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



పరిశ్రమను బంద్ చేయించిన సిఐటియూ నాయకులు

## రైతుల డిమాండ్‌లను నెరవేర్చాలి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** రైతు సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునివ్వగా ఈ బంద్‌కు మద్దతుగా సీఐటియూ శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని పరిశ్రమలను మూసి వేయించి మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతుల న్యాయపరమైన డిమాండ్‌లను కేంద్ర ఒప్పుకోవాలని, సిఐటియూ మద్దతు ఎప్పుడూ రైతులకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేషం, నాగేందర్‌రెడ్డి, సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, సిద్దిరాంలు, గణేష్‌రెడ్డి, స్వామి, బాలయ్య, అంజారెడ్డిలు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నర్సాపూర్‌లో మానవ హారంగా ఏర్పడిన సిఐటియు నాయకులు, కార్మికులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం నర్సాపూర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో చిల్డ్రన్ పార్క్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు బారీ ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కదారి నాగరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్మికులకు అన్ని సౌకర్యాలతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు దేశ వ్యాప్తంగా కార్మికుల అధ్వర్యంలో సమ్మె నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు అన్నపూర్ణ, రమేశ్, అశోక్, రాములు, నర్సింలు, శంకర్,రామ్‌చందర్, పుష్ప, వరలక్ష్మి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏడిఈ

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణం లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 132/33కెవితో పాటు మున్సిపా లిటీ పరిధిలోని 33కెవి వాటర్‌గ్రిడ్ ఐసోలేటర్ మార్పిడి కోసం మరమ్మత్తుల కారణంగా నేడు శని, సోమ, బుధవారాలలో మున్సి పాలిటితో పాటు హుస్నాబాద్ మండలం లోని మహ్మదాపూర్, పోతారం,మీర్జాపూర్,కట్కూర్,తోటపల్లి,సబ్‌స్టేషన్‌ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ ప్రాంతాలకు చెందిన వినియోగదారులు సహకరించాలని హుస్నాబాద్ డివిజన్ ఏడిఈ దుర్గా శ్రీనివాస్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

**చేవెళ్ల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన నర్సింలు, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్థులు, పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు

### ఏడు వాహనాలపై శ్రీదేవి,భూదేవి సమేతంగా ఊరేగిన శ్రీవారు



విశేష అలంకరణలతో ఊరేగుతు భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

**కొడంగల్,ఫిబ్రవరి 16ప్రభాతవార్త** పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ ంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానంగా కొనసాగుతున్న శ్రీవారి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుపతి ఆలయంలో మాదిగానే ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీవేంకటేశ్వర స్వామివారు (సప్త) ఏడు వాహనాలపై ఊరేగుతు భక్తుల కు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆలయ అర్చకులు శ్రీబాలాజీ మాట్లాడుతు రథసప్తమి ఉత్సవాలను ఒకరోజు బ్రహ్మోత్సవం నిర్వహించడం అనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. రథసప్తమి సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష అలంకరణలతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వేళల్లో వాయిద్యం,సుప్రభాతంతో మొదలుకొని శ్రీవారికి తోమాల సేవ,అర్చన అనంతరం శ్రీవారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ,చిన్నశేష వాహనం,గరుడ వాహన సేవ,హనుమంత వాహనసేవల అనంతరం మధ్యాహ్నం 12గంటలకు ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్పవృక్ష వాహనసేవ,సాయంత్రం సర్వభూపాల వాహనసేవ,రాత్రి చంద్రప్రభ వాహనంపై బాలాజీమాడ వీధుల్లో శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీవారు ఊరేగుతు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా కొడంగల్‌తో పాటు పరిసర ప్రాంతాలైన తాండూర్,పరిగి,కోస్గీ, మహబుబ్‌నగర్, హైద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ ఈఓ బాల్‌రాజ్, ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్,నందారం రత్నం,నందారం వెంకటక్రిష్ణ, నందారం ప్రశాంత్‌లతో పాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఎంసీ సభ్యులకు అవగాహన

**మేడ్చల్, ఫిబ్రవరి 16. ప్రభాతవార్త :** మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అకృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 35 ప్రాథమిక పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లు సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు అమర్, శశికళ, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రభాత్, శివ, పృధ్వి, జ్యోతి, స్వప్న. మహాలక్ష్మి, పాల్గొన్నారు.


జోగినాథ రథానికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## ఘనంగా రథసప్తమి... జోగినాథ రథానికి పూజలు

**జోగిపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జోగిపేటలో రథసప్తమిని ఘనంగా నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకొని పట్టణంలోని జోగినాథ స్వామి ఆలయంలో, రథం వద్ద ఆలయ కమిటీ సభ్యులు పూజారి భద్రప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ధర్నా



సిఐటియు ఆధ్వర్యంలో జోగిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**జోగిపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించటంతోపాటు తహసీల్దారు కార్యాయలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు కనీసవేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరండిమాండ్లకు సంబంధించి వినతిపత్రం అందచేశారు.

## నేటి నుంచి హజ్రత్ సయ్యద్ ఆబేద్ హుస్సేన్ చిస్తీ ఉర్సు ఉత్సవాలు


హజ్రత్ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన మజీద్

**హత్నూర, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** నేటి నుంచి(శనివారం) హజ్రత్ సయ్యద్ ఆబేద్ హుస్సేన్ చిస్తీ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హత్నూర మండల పరిధిలోని కాసాల శివారులోగల దౌల్తాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోగల 37వ హజ్రత్ సయ్యద్ ఆబేద్ హుస్సేన్ చిస్తీ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. రంగురంగులతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. 17న సందల్ ముబారక్ (గంధం) ఈనెల 18న చిరాగా (దీపారాధన) సమ కార్యక్రమం 19న కత్మ ఖురాన్ జీయరత్ ఫాతిహావంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక, హైదరాబాద్ తదితర జిల్లాలనుంచి భక్తులు వస్తుంటారని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

## ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ


మనూర్ ఉన్నత పాఠశాలలో పోషకులకు పాదపూజలు చేస్తున్న విద్యార్థులు

**మనూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాఠశాలలో సామూహిక పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు రాజు, చంద్రకాంత్, మల్లికార్జున్, భీమ్‌రావు, వివేకానంద సేవ సమితిసభ్యులు సిద్దారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగేందర్‌రావు పాల్గొన్నారు.

## పాడిచన్‌పల్లి పాఠశాలలో స్వయం పాలన


జడ్పీహెచ్ఎస్‌లో స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**పాపన్నపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని పొడిచన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా ఎ.రక్షక్, ఎంఈఓగా రుచిత, డిఈఓగా ఎ.తేజ, డిప్యూటీ డిఈఓగా ఎం పూర్ణిక, ఉపాధ్యాయులుగా, పీఈటిగా విద్యార్థులు ఒక రోజు బాధ్యతలు నిర్వహించారు. తమతోపాటు చదువుకుంటున్న విద్యార్థులకు పాఠాలు బోధించారు.ప్రతిభ చాటిన విద్యార్థులైన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు ఎ.ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు కె కిషన్, జి భవానీ ప్రసాద్, ఎ వెంకటేశం, డి.గన్ను, డాక్టర్ దేవయ్య, జి శ్రీనివాస్, కె శ్రీలక్ష్మి, అమీనా బేగం, పిఈటి రవి పాషాలు బహుమతులను అదచేసి అభినందించారు.

## ఖమ్మంపల్లిలో రూ. 80 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం

**మునిపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని ఖమ్మంపల్లి గ్రామం నుంచి పెద్దచెల్మెడ వరకు 80 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించే రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూమి పూజ నిర్వహించి శ్రీకారంచుట్టారు.ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఖమ్మం పల్లి నుంచి పెద్ద చెల్మెడ వరకు రోడ్డు సౌకర్యం అనుకూలంగా లేక ప్రజలు ఇబ్బందులుపడ్డారని, ఇది గమనించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాంరెడ్డి, ఎంపిటిసి శివలీల మల్లన్న, తాజీ మాజీ సర్పంచ్ జాస్మిన్ గుడ్డు పటేల్, గ్రామ కమిటీ అధ్యక్షులు గుజ్జరి పాండు, యూత్ అధ్యక్షులు టేకురి నాగరాజు, మైనార్టీఅధ్యక్షులు సమియోద్దిన్, ఎస్‌సి అధ్యక్షులు తుడం నగేష్, కుర్మ గొల్ల అధ్య క్షులు సిద్దె నర్సింలు, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు మత్యారి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ కలలి మల్లన్న, గ్రామ వార్డు సభ్యులు, నాయకులు మంగలి రాజు, చాకలి నర్సింలు, నాయకులు టేకూరి ఏసంతి, డాక్టర్ ఫారూఖ్, బుక్క ముంతాజ్, చెల్మెల్ సంగన్న, వడ్ల జగన్, ఎల్లగారి రాచన్న, కోట సురేష్, ఇనాయిత్ ఖాన్, సిద్దే మల్లయ్య, వనపురం వీరన్న,జుట్టు రాములు, మొల్ల యూనుస్, చాకలి మొగులయ్య, చాకలి నర్సింలు, చాకలి నవీన్, చాకలి నర్సింలు, మంగలి బిక్షపతి, జోగిపేట శివన్న, గండ్ల సిద్దన్న, జోగిపేట సంగమేశ్వర్, ముషలపురం వినోద్, కాపు వేమరెడ్డి, బేగరి నరేష్, బేగరి సతీష్ పాల్గొన్నారు.


కొల్చారంలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు


జహీరాబాద్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

# కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలి

### సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ

**కొల్చారం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి కనీస వేతనాలు అమలు చేయడం లేదని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ అన్నారు. శుక్రవారం కొల్చారంలో బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను అమలుచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక రంగాల నాయకులు శివలక్ష్మీ, స్వరూప, లక్ష్మీ, చంద్రకళ, నాగమణి, గీత, లక్ష్మీ, సబిత, రమ, రాణి, దుర్గయ్య, ప్రభాకర్, అర్జైయ్యా, కరుణాకర్, శేఖర్, సంతోషన, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

**పోరాటంతోనే హక్కులు సాధించుకోవచ్చు...**

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై శుక్రవారం నిర్వహించిన దేశవ్యాప్త బంద్‌లో భాగంగా పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆటోలు, బస్‌లు,కార్లతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.రాంచందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే తన తీరు మార్చుకుని పాలన సాగించాలని సూచించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం వెంటనే మానుకోవాలని హితువు పలికారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. కార్మికులకు పెరిగినరేట్లకు అను గుణంగా రూ. 26వేల అందించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి ఎస్ మహిపాల్, ఆయా పరిశ్రమల సంఘాల నాయకులు రాజిరెడ్డి, నర్సయ్య, సందీప్‌రెడ్డి, నందమ్మ, సతీష్ చౌవాన్, యశోదమ్మ, కామయ్య, పుష్ప ధన్‌రాజ్, తేజేబ్, ఎల్లప్ప, శోబ, సిహెచ్ బక్కన్న, రాబర్ట్‌గౌరమ్మ పాల్గొన్నారు.


సంగారెడ్డిలో బస్సు యాత్రపై సమాలోచన చేస్తున్న బిజెపి నాయకులు

## 4 పార్లమెంట్ క్లస్టర్‌లలో యాత్రను విజయవంతం చేద్దాం

**-సంగారెడ్డిలో బిజెపి బస్సు యాత్రపూ నేతల సమాలోచన**

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో(జహీరాబాద్, కరీంనగర్, చేవెళ్ల, మెదక్) నిర్వహించే బస్సుయాత్ర కోసం పార్టీ నాయకులు యాత్ర విజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాలోచన చేశారు. సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమిందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దుబ్బాక మాజీ శాసన సభ్యులు రఘునందన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జి బసాపురం లక్ష్మీ నరసయ్య, జహీరాబాద్ శాసన సభ ప్రభారీ శ్రీనివాస్‌నాయుడు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, మురళీధర్‌గౌడ్, దిలీప్ నాయక్, అనంత్‌రావు కులకర్ణి, మాణిక్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తరెడ్డి, మల్లికార్జున్ పాటిల్, జిల్లా ఉపాధ్యక్షులు, నాయకులు, ఆయా మండలాల అధ్యక్షులు, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు ఉప తహసీల్దార్ శుభాకాంక్షలు


తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప తహసీల్దార్ విజయలక్ష్మి

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సంగారెడ్డి తహసీల్దార్‌గా ఎం దేవదాస్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ దేవదాస్‌కు ఉప తహసీల్దార్ విజయలక్ష్మి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఎం దేవదాస్ నారాయణఖేడ్ మండలం నుంచి సంగారెడ్డికి బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రమోద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. సంగారెడ్డి తహసీల్దార్‌గా సేవలు అందించిన ఫర్హీన్ షేక్ హత్నూర మండలానికి బదిలీపై వెళ్లారు.

## డిఎస్‌పిగా రామ్మోహన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ డిఎస్‌పిగా రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు డిఎస్‌పిగా విధులు నిర్వహించిన వి రఘు ఇంటలిజెన్స్‌కు బదిలీ అయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌రెడ్డిని సిఐ ఆర్ రవి, ఎస్ఐ లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు

**-మహీంద్రా లాజిస్టిక్ సియస్ఆర్ హెడ్ విజయపవార్**


రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జాతీయ రహదారులపై అతివేగంతో ప్రయాణిస్తుండటంతోనే అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అతివేగం అదుపుతోనే రోడ్డు ప్రమాదాలను నివారించుకునే అవకాశం ఉంటుందని మహీంద్రా లాజిస్టిక్ సిఎస్ఆర్ హెడ్ విజయ్‌పవార్, ఎల్ అండ్ టి ప్రాజెక్ట్ హెడ్ రాజేష్ విచార్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మహీంద్రా అకాడమీలో రోడ్డు ప్రమాదాల నివారణపై మహేంద్రా లాజిస్టిక్, మాగ్నో సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్, రాజేష్ విచార్‌లు కరపత్రాన్ని అవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్, రాజేష్ విచార్‌లు మాట్లాడుతూ జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వరకు జాతీయ రహదారిని తమ సంస్థ దత్తత తీసుకుని ప్రమాదాలు లేని రోడ్డుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు రహదారులపై గల గ్రామాల ప్రజలకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహన చోదకులు, ప్రజలు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని గుర్తు చేశారు. వాహనాల చోదుకులు విధిగా హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో మహీంద్రా లాజిస్టిక్ మాగ్నో ఎల్‌అండ్‌టి మాగ్నో సంస్థ అధికారులు చేతన్, రవి, గణేష్, సిబ్బంది సత్వీర్ సింగ్, ప్రశాంత్, రాములు, అప్సర్ భాస్కర్‌రెడ్డి, విష్ణురెడ్డి, రాజ్‌కుమార్, రాకేష్ కులమేశ్వర్, సంతోష్, ధనరాజ్, అనిల్, దత్తాత్రేయులు, వాహనాలు డ్రైవర్లు పాల్గొన్నారు.

## గుండెపోటుతో బిఆర్ఎస్ నేత మృతి

**సిర్గాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని గరిడేగాంకు చెందిన బిఆర్ఎస్ నేత కొండ మారుతి(51) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం ఛాతిలో నొప్పిరావడంతో కుప్పకూలిపోయిన మారుతిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో తిరిగిరాని లోకాలకు చేరిపోయినట్లు తెలిపారు. కొండ మారుతి అకాల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


శ్రీనివాస్‌నగర్ కాలనీలో బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్

## శ్రీనివాస్‌నగర్‌లో బస్తీ దర్శన్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 7వ బ్లాక్‌లో శుక్రారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్తీదర్శన్‌ను పురస్కరించుకుని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో కుక్కల బెడద అధికంగా ఉందని కాలనీలో తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. రోడ్లపై వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తుండటంతో, రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా వాహన చోదకులు యమస్పీడుగా వాహనాలను తోలుతున్నారని, ప్రమాదాలకు ఆస్కారం ఉందని ప్రజలు కార్పొరేటర్ పుష్పనగేష్ దృష్టికి తెగా స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ దశల వారిగా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కాలనీలో సమ్యలు లేకుండా తన వంతు కృషి చేస్తానని కాలనీ వాసులకు కార్పొరేటర్ హామి చేశారు. కార్యక్రమంలో కుశంగుల దాస్, కావలి శ్రీరాములు, సిఎం మల్లేష్, బాలయ్య, శ్రీను, ఖాజా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో మెదక్‌కు సిటీ స్కానింగ్ సెంటర్ : ఎమ్మెల్యే

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** మెదక్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెదక్ పట్టణానికి సిటీ స్కానింగ్ సెంటర్‌ను తీసుకురానున్నట్లు మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో మాట్లాడానని, సిటీ స్కానింగ్ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై ఆయన చర్చించారు. దీంతో సుముఖత వ్యక్తం చేసిన ఆరోగ్య శాఖ మంత్రి త్వరలోనే మెదక్ పట్టణంలో సిటీ స్కానింగ్ ఏర్పాటు అయ్యేలా చర్యలు చేపడతానని పేర్కొన్నారని ఆయన తెలిపారు.

## పాదయాత్రకు పక్షం రోజులు పూర్తి

**సిర్గాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గజేంద్ర భారతి ఆశ్రమ పీఠాధిపతి అంతర్గాం ఆధ్వర్యంలో పండరిపూర్‌కు నిర్వహిస్తున్న పాదయాత్ర పక్షం రోజులు పూర్తి చేసుకుంది. పాదయాత్రీకులకు మండలంలోని చాప్టా గ్రామానికి చెందిన అవుటి రత్నమ్మ నరసింహులు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. గత 21 సంవత్సరాలుగా పండరిపూర్‌కు నిర్వహిస్తున్న పాదయాత్రీకులకు రత్నమ్మ నరసింహులు అన్నదాన కార్యక్రమం అందచేస్తూ వస్తున్నట్లు శ్రీకరణ్ గజేంద్ర భారతి పేర్కొన్నారు. కార్యక్రమంలో హరిభక్త ప్రియులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రామోజిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. శివ, ప్రశాంత్, విశాల్, పూజ, అమూల్య, దీపిక తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుభాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొజ్యా నాయక్, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

**పెద్దగోపులారంలో...**


పెద్దగోపులారంలో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**మునిపల్లి, ఫిబ్రవరి 16. ప్రభాతవార్త:** మండలంలోని పెద్దగోపులారం పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఆనందోత్సవాలతో ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. డిఈఓగా అర్జున్, ఎంఈఓగా అనీష్, ప్రధానోపాధ్యాయులుగా వెన్నెల, ఉపాధ్యాయులుగా ఆఫ్రికన్, బింధు, సాధన, చరణ్, సాత్విక్, మోయిజ్, సంజయ్, కళ్యాణ్, దీక్షితలు వ్యవహరించారు. తోటి విద్యార్థులు పాఠాలు బోధించారు.

## నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌లను సన్మానించిన ఎమ్మెల్యే

**నర్సాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నర్సాపూర్‌లో నిర్వహించిన మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం ఇప్పటివరకు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వెంకట్‌గోపాల్ బదిలీ కాగా ఆయన స్థానంలో నూతనంగా బదిలీపై వచ్చిన జైత్‌రాంనాయక్‌ను శాలువాలతో సన్మానించారు. అనంతరం సిబ్బంది వారిని సన్మానించారు.నర్సాపూర్ నుండి బదిలీ అయిన వెంకట్‌గోపాల్ ను మరియు నర్సాపూర్ మున్సిపల్ కమీషనర్‌గా వచ్చిన జైత్‌రాంనాయక్ లను ఇద్దరి మున్సిఫల్ కమీషనర్ లను ను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అభినందించారు.


మున్సిపల్ కమీషనర్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


పాపన్నపేటలో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మికులు

## సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో

**పాపన్నపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా పాపన్నపేటలో సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చి దశాబ్దకాలం గడుస్తున్నా రైతాంగ, కార్మిక సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కనీస వేతనాన్ని రూ. 26వేల నిర్ణయించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సఫరీ, అంగన్‌వాడి, గ్రామ పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

**పాపన్నపేటలో ఆటోల బంద్**

**పాపన్నపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం పాపన్నపేటలో ఆటోలు బంద్ చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు బాబర్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆటోలు రోడ్డెక్కపోవడంతో ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

**-సిఐటియు జిల్లా నాయకులు రమేష్ గౌడ్**



సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న స్కీమ్ వర్కర్లు

**మునిపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేస్తూ కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బుదేరా చౌరస్తాలో సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లేకార్డులు చేతబూని రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ రోజురోజుకు ధరలు ఆకాశానికి అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం, రైతాంగం సమస్యలు పరష్కరించడంతో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. స్కీంవర్కర్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుమార్, ఆశావర్కర్ల సంఘం అధ్యక్షురాలు సంగీత, నిర్మల, లలిత, సామిత్రి, మంజుల, జయసుధ, విజయలక్ష్మి, పుణెమ్మె, పెంటమ్మ, వివోఏల సంఘం మండల అధ్యక్షులు మొగులయ్య, లింగమమ్మ, రాణి, స్వప్న, దివాకర్, నాగరాజు, నాగమణి, గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ మండల అధ్యక్షులు విఠల్‌గౌడ్, నర్సింలు, రవి, కృష్ణ, శ్రీనివాస్, లక్ష్మమ్మ, ఆటో యూనియన్, ఉపాధిహామీ కూలీలు, రైతులు కార్మికులు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**మనూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మండలంలోని మాయికోడ్ ఎంపియుపిఎస్ పాఠశాలలో విద్యను అర్జిస్తున్న విద్యార్థులకు శుక్రవారం యూత్ ఫర్ సేవ, ఎన్‌టిటిడిఎటిఎ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, బ్యాగులు, జామెంట్రీ బాక్సులను పంపిణి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీవన్ రాథోడ్, ఉపాధ్యాయులు రాజు, యూత్ ఫర్ సేవ, ఎన్‌టిటిడిఎటిఎ సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టర్ తిపవరాజు ప్రసాద్, చంద్రశేఖర్ ఆచార్య పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు కమిషనర్‌గా సేవలు అందించిన దేశ్‌ముఖన సుభాష్‌రావును హైదరాబాద్ జిహెచ్ఎంసికి బదిలీచేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని జహీరాబాద్‌కు బదిలీ కావడంతో శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలకి శుభాకాంక్షలు తెలిపారు.

## జహీరాబాద్ ఆర్‌డిఓగా రాజు

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ ఆర్‌డిఓగా ఎస్ రాజు నియమితులయ్యారు. ఇంతవరకు ఆర్‌డిఓగా విధులు నిర్వహించిన వెంకారెడ్డి హైద్రాబాద్ శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. హుజురాబాద్ ఆర్‌డిఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్ రాజును జహీరాబాద్ ఆర్‌డిఓగా అధికారులు బదిలీ చేశారు.

## ఎద్దుమైలారంలో విద్యార్థుల స్వయం పాలన

**కంది, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఎద్దుమైలారం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా యండి సోహన్, ఉపాధ్యాయులుగా ప్రవళిక, శృతి, గౌతమి, వర్షిణి, భూమిక, లక్ష్మీగాయత్రి, సిద్రా, రిదా, సాత్విక్, భూమిక, ప్రణీత్‌రెడ్డి, నందవరణ్, మణికంఠ, నీరజ్, లోకేష్, వరుణ్ కుమార్‌లు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠాలో బోధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి జనార్ధన్, ఉపాధ్యాయులు శ్రీలత, వి పుష్పకళ, పి వినీల తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా సాగుతున్న రీ బీటీ రోడ్డు పనులు

**కొల్చారం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** రంగంపేట పరిసర గ్రామ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుంది. రంగంపేట శివారు నుండి కోనాపూర్, ఏటిగడ్డ మాందాపూర్ వెళ్లే రోడ్డు పైతర జంక్షన్ వరకు చేపడుతున్న రీబీటీ రోడ్డు పనులు వేగవంతంగా శుక్రవారం నుండి సాగుతున్నాయి. రోడ్డు మరమ్మతుల కోసం గ్రామీణ రహదారుల మరమ్మతు నిధుల నుండి 1 కోటి 80 లక్షలు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఏఈ ఇర్ఫాన్ హుస్సేన్ తెలిపారు. సుమారు 2.7 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుతుంది.

# పట్టపగలే రూ. 5 లక్షలు చోరీ

**రామాయంపేట మున్సిపాలిటీ, (చేగుంట) ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** పట్టపగలే దోపిడీ దొంగలు ఐదు లక్షల రూపాయల దోపిడీ చేసిన సంఘటన చేగుంటలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ బిల్డర్‌గా పనిచేస్తున్నారు. చేగుంట మండల కేంద్రంలోని సీతారాంనగర్ కాలనీలో ఉంటున్న మిత్రుడి ఇంటికి సంబంధించిన ఐదు లక్షల రూపాయలను స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకు నుంచి డ్రా చేసి కారులో తీసుకువచ్చారు. మిత్రుడి ఇంటి ముందు కారును పార్క్ చేసి టీ తాగి రావడానికి ఇంట్లోకి వెళ్లగానే నలుగురు గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న ఐదు లక్షల రూపాయలను దోపిడీ చేసి పారిపోయారు. కారు అద్దాలు పగల గొడుతూ ఐదు లక్షల రూపాయలను తీసుకెళ్తుండగా వెంటనే ఇంటినుండి బయటకు వచ్చి దొంగలను వెంబడించినప్పటికీ వారు దొరకలేదని పేర్కొ న్నారు. బాధితుడు విష్ణువర్ధన్‌రెడ్డి చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజ్‌ని చేగుంట పోలీసులు పరిశీలిస్తున్నారు.


దొంగలు డబ్బులు దోపిడీ చేసిన కారు